

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, మార్చి 25 : రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను సోమవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పీకర్‌కు హోలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:30 మంగళవారం
సహర్ | 4:52 బుధవారం

డ్రైవర్లకు 'పరీక్ష'



పోలీసుల పరీక్షలో జీరో వచ్చినట్లు చూపుతున్న బ్రీత్ అనలైజర్

- మద్యం తాగకున్నా.. బ్రీత్ అనలైజర్ పరికరంలో నమోదు
- ఇద్దరు డ్రైవర్లపై చర్యలకు రంగం సిద్ధం
- మద్యం సేవించలేదంటున్న బాధితులు
- మంచిర్యాల ఆర్టీసీ డిపోలో ఘటన

మంచిర్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురికాకుండా సంస్థ చేపడుతున్న కొన్ని చర్యలు డ్రైవర్ల మెడకు చుట్టుకుంటున్నాయి. చేయని తప్పుకు కూడా బాధ్యులను చేస్తుండటంతో మూల్యం చెల్లించవలసిన పరిస్థితి నెలకొంది. డ్యూటీలో చేరే డ్రైవర్లు మద్యం సేవించి ఉంటే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో డిపో వద్ద సెక్యూరిటీ సిబ్బంది బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రయాణికుల భద్రత కోసం సంస్థ ఈ నిబంధనలను విధించింది. ఇంతవరకు బాగానే ఉన్నా, బ్రీత్ అనలైజర్ పరికరం పనితీరు కారణంగా మద్యం సేవించకపోయినా సేవించినట్లు రిపోర్టు రావడంతో ఇద్దరు డ్రైవర్లు విధులకు దూరమయ్యారు. మంచిర్యాల ఆర్టీసీ డిపోలో వారం రోజుల క్రితం సంఘటన జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మద్యం సేవించకున్నా సేవించినట్లు

డిపోలో పని చేస్తున్న ఓ డ్రైవర్ ఈ నెల 16న ఉదయం 5.30 గంటలకు మియాపూర్ వెళ్లాల్సిన సర్వీసును నడిపేందుకు విధుల్లో చేరాడు. వాహనాన్ని తీసి సెక్యూరిటీ వద్ద ఎంట్రీ చేసేందుకు వేచియుండగా, అక్కడి సిబ్బంది బ్రీత్ అనలైజర్‌తో అతనికి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో సదరు డ్రైవర్ 20 శాతం మేర మద్యం సేవించినట్లు రికార్డయింది. దీంతో అతని విధులు రద్దు చేసిన అధికారులు మరో డ్రైవర్‌ను డ్యూటీపై పంపారు. అసలు మద్యం సేవించడమే అలవాటు లేని సదరు డ్రైవర్ అవమానంగా భావించి డిపోలోని కంట్రోలర్ అనుమతితో నిజ నిర్ధారణ కోసం అప్పటికప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. ఆ పరీక్షల్లో అతనికి '0' శాతం నమోదైనట్లు రిపోర్ట్ వచ్చింది. దాని ప్రింట్ తీసుకొచ్చి డిపో అధికారులకు చూపించాడు. అయినా రకరకాల కారణాలు చెబుతూ అతనికి పది రోజులుగా విధులు కేటాయించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తన 14 సంవత్సరాల సర్వీసులో ఏనాడూ ఇలా జరగలేదని తీవ్ర మనస్తాపానికి గురవుతున్నాడు.

మరో సంఘటనలో ఇంకో డ్రైవర్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఈ నెల 17న రాత్రి 9.15 గంటలకు హైద్రాబాద్ వెళ్లేందుకు సదరు డ్రైవర్ విధుల్లో చేరాడు. బస్సును సెక్యూరిటీ వద్దకు తీసుకెళ్లగానే బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. డ్రైవర్ 12 శాతం మేర మద్యం సేవించినట్లు రిపోర్ట్ వచ్చింది. ఇతను కూడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా అక్కడి సిబ్బంది డిపో అధికారుల అనుమతి కావాలంటూ పరీక్ష చేసేందుకు నిరాకరించారు. దీంతో వెనక్కి వచ్చిన ఆయన మద్యం సేవించలేదని డిపో అధికారులకు మొర పెట్టుకున్నాడు. అప్పటి నుంచి తనను విధుల్లోకి తీసుకోవడం లేదని ఆవేదన చెందుతున్నాడు.

డ్రైవర్లపై చర్యలకు రంగం సిద్ధం

బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో పాయింట్లు వచ్చిన కారణంగా డిపో ఉన్నతాధికారులు ఇద్దరు డ్రైవర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. త్వరలో సస్పెన్షన్ వేటు వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. బ్రీత్ అనలైజర్ పరికరం పనితీరు కారణంగా రిపోర్టు వచ్చినంత మాత్రాన చర్యలు ఎలా తీసుకుంటారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. డిపో ఉన్నతాధికారులు స్పందించి, వాస్తవాలను పరిగణలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రిపోర్టు ఆధారంగానే చర్యలు

రవీంద్రనాథ్, డిపో మేనేజర్

విధుల్లో చేరిన ప్రతీ డ్రైవర్‌కూ సెక్యూరిటీ సిబ్బంది బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో మద్యం సేవించినట్లు రికార్డు అయితే విధులకు అనుమతించం. ఇద్దరు డ్రైవర్లకు వినియోగించిన పరికరం కూడా కొత్తది. వారితోపాటు ఇతర డ్రైవరకూ దానితోనే పరీక్షలు నిర్వహించాం. ఇద్దరు మద్యం సేవించినట్లు రిపోర్ట్ వచ్చింది. దాని ఆధారంగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.



మంచిర్యాల ఆర్టీసీ డిపో

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



ధర్నా చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న డీఎం

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 25: మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్‌కు వెళ్లి మంచిర్యాలకు వస్తుండగా ధర్మపురి వద్ద డ్రైవర్, కండక్టర్లపై ప్రజలు దాడి చేయడం అమానుషమని పేర్కొంటూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట డ్రైవర్లు, కండక్టర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిజామాబాద్ నుంచి మంచిర్యాలకు వస్తున్న ఆర్టీసీ బస్సును కొందరు అడ్డగించి వారిని బస్సులో ఎక్కించుకోలేదని పేర్కొంటూ దాడి చేశారని డ్రైవర్ వీఎం రెడ్డి, కండక్టర్ అశోక్‌లు పేర్కొన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ రవీంద్రనాథ్ చేరుకుని వారిని సముదాయించారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్‌లు మాట్లాడుతూ తమపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, తాము ఎలాంటి తప్పు చేయకున్నా తమపై దాడి చేశారని పేర్కొన్నారు. బస్సులో చోటు లేకపోవడంతో బస్సు ఆపనందుకు తమపై దాడి చేశారని, దాడి చేసిన వారిని శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఏదైనా జరిగితే ప్రభుత్వం, యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

సిబ్బందిపై దాడులు సరికాదు

మంచిర్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడటం సరికాదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డిపో మేనేజర్ రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం ధర్మపురికి డ్యూటీపై వెళ్లిన డ్రైవర్, కండక్టర్లపై కొందరు ప్యాసింజర్లు దాడి చేసి కొట్టారని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని ఏసీసీ వద్ద ఇటీవల బైక్‌ను తప్పించేందుకు హారన్ కొట్టిన ఓ డ్రైవర్‌పై సదరు వ్యక్తి చేయి చేసుకున్నాడని డీఎం పేర్కొన్నారు. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులుగానీ, రోడ్డుపై వెళ్లే వాహన చోదకులుగానీ కొంత సంయమనం పాటించాలని, లేనియెడల దాడులకు కారణమైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కాళభైరవునికి ప్రత్యేక పూజలు



కాళభైరవ స్వామిని దర్శించుకుంటున్న జడ్జి అర్జున్

కోటపల్లి, మార్చి 25 : మండలంలోని పారుపల్లి సమీపంలోని కాళభైరవ స్వామిని సోమవారం పెద్దపల్లి జిల్లా అసిస్టెంట్ సెకండ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ దర్శించుకున్నారు. భైరవస్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. హోలీ పండగ వేళ ప్రజలందరు బాగుండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక పోలీసులు స్వాగతం పలికారు.

గూడెం ఆలయంలో పౌర్ణమి జాతర



సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, మార్చి 25: పౌర్ణమి పురస్కరించుకుని సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి జాతర జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ సమీపంలోని గోదావరి నదిలో స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. ఆలయానికి చేరుకొని కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



ఏసీసీ, మార్చి 25: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్, సభ్యులు సిరిపురం రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో హోలీ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్



మందమర్రిలో మాజీ ఎమ్మెల్యేకు రంగులు పూస్తున్న కార్యకర్తలు



మంచిర్యాలలో హోలీ సంబరాలు

రంగ్ బర్‌సే

- జిల్లాలో ఘనంగా హోలీ వేడుకలు
- చిన్నారులు, యువత సందడి
- పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్న ప్రజలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 25 : జిల్లా కేంద్రంలో సోమవారం హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. యువకులు, మహిళలు, చిన్నారులు, పెద్దలు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. వాడవాడలా హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. కాలనీల్లోని ప్రధాన కూడళ్ల వద్దకు కాలనీవాసులు చేరుకుని రంగులు చల్లుకున్నారు. చిన్నారులు, యువత, స్నేహితుల వద్దకు వెళ్లి రంగులు చల్లారు.

హాజీపూర్: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో హోలీ పండగ ఘనంగా జరిగింది. చిన్నారులు, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుని రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు.

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో యువతులు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి రంగులు చల్లుకున్నారు. పిల్లలు ఒకరి పై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. హోలీ అనంతరం ఇళ్లల్లో, గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావులు, కడెం ప్రధాన కాలువలో, సమీప గోదావరి తీరాలకు వెళ్లి స్నానాలు చేశారు.

మందమర్రిటౌన్: పట్టణంలో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్దా తేడా లేకుండా చిన్నారులు, యువకులు, మహిళలు రంగులు చల్లుకున్నారు. మూడో జోన్‌లో మహిళలు ప్రధాన కూడలిలో రంగులు చల్లుకుని నృత్యాలు చేశారు. రెండో జోన్‌లోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ నివాసం వద్ద హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుపై రంగులు చల్లారు. మార్కెట్ సెంటర్‌లో యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకున్నారు. హమాలీ సంఘం, ఆటో యూనియన్ నాయకులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్, మహంత్ అర్జున్‌కుమార్, కాసర్ల శ్రీనివాస్, కిరణ్, పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని గ్రామాల్లో హోలీ పండగను యువకులు, మహిళలు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు.

వేమనపల్లి: మండలంలో హోలీ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే చిన్నారులు, యువకులు స్నేహితులు, బంధువుల ఇండ్లకు వెళ్లి రంగులు చల్లుకున్నారు. అనంతరం యువకులు స్థానిక చెరువులు, కుంటల్లో స్నానాలు చేశారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

మందమర్రి రూరల్: మండల వ్యాప్తంగా హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే చిన్నారులు, యువకులు, మహిళలు, యువతులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.

చెన్నూరు: హోలీ పండగ వేడుకలు చెన్నూరు పట్టణం, మండలంలో ఘనంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతులు, చిన్నారులు ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో వేడుకలు అంబరాన్నంటాయి. వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో, మండలంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. యువకులు, చిన్నారులు, మహిళలు కాలనీల్లో రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. యువత స్నేహితుల ఇండ్లకు వెళ్లి వారిపై రంగులు చల్లారు. పట్టణంలోని రంగుల దుకాణాల వద్ద ప్రజలు రంగులను కొనుగోలు చేయడంతో రద్దీ నెలకొంది.

కన్నెపల్లి: కన్నెపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ పండగను యువకులు, మహిళలు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాలనీల్లో యువత రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

కాసిపేట: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివాసి గిరిజనులు కామదహనం నిర్వహించిన అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో హోలీ వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లోని కాలనీల్లో చిన్నారులు, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

నెన్నెల: మండలంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. వయోభేదం లేకుండా అందరు రంగుల్లో మునిగితేలారు. పరస్పరం రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. డ్యాన్సులు చేస్తూ యువత ఉత్సాహంగా గడిపారు. ఆటాపాటలతో ఆహ్లాదంగా గడిపి స్థానిక చెరువుల్లో స్నానాలు చేశారు. ఆదివారం రాత్రి కామదహనం చేసి జాజిరి సంబరాలకు ముగింపు పలికారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో హోలీ పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా యువకులు, మహిళలు కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఎటు చూసినా రంగులు చల్లుకుంటున్న దృశ్యాలే కనిపించడంతో సందడి వాతావరణం నెలకొంది.

ఏసీసీ: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో హోలీ వేడుకలను నిర్వహించారు. సీపీ శ్రీనివాస్ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులు సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, జైపూర్, మంచిర్యాల ఏసీపీలు వెంకటేశ్వర్లు, ప్రకాష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో చిన్నా పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకల్లో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసంలో హోలీ వేడుకలు నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్: మున్సిపాలిటీలో హోలీ పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు రంగులు చల్లుకుంటు వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు.

కోటపల్లి: మండలంలో చిన్నారులు, యువతీ, యువకులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. చెరువులు, కుంటలు, నీటి వనరుల వద్ద స్నానాలు ఆచరించారు.

జన్నారం: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే యువకులు, చిన్నారులు, మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.



హోలీ సంబరాల్లో పోలీసు అధికారులు



కొండాపూర్ యాపలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



బెల్లంపల్లిలో హోలీ వేడుకలు

పండుగ పూట విషాదం

- ఈతకు వెళ్లి యువకుడి మృతి

దండేపల్లి/జన్నారం, మార్చి 25 : అప్పటి వరకు హోలీ వేడుకల్లో ఆనందంగా గడిపిన యువకుడు స్నానానికి వెళ్లి మృత్యువాత పడడం కలచివేసింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన అనంతరం తల్లి, తమ్ముడు, చెల్లెల్లితో కలిసి అమ్మమ్మ ఇంటికి సరదాగా వచ్చి మృతి చెందడం విషాదం నింపింది.

జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోపులపురం అశ్విని తల్లిగారి ఇళ్ళయిన దండేపల్లి మండలం పాతమామిడిపల్లికి పిల్లలతో కలిసి 5 రోజుల క్రితం వచ్చింది. సోమవారం హోలీ పండుగ కావడంతో పెద్ద కుమారుడు కార్తీక్ (18) స్నేహితులు ఆకుల మణికుమార్, పెట్టెం అన్వేశ్‌తో కలిసి హోలీ ఆడాడు. అనంతరం స్నానం చేసేందుకు మండలంలోని తానిమడుగు వద్ద కడెం కాలువలోకి దిగాడు. కార్తీక్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగాడు. అక్కడే స్నానానికి వచ్చిన అనిల్, అరవింద్‌లు కార్తీక్‌ను బయటకు తీశారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న కార్తీక్‌ను మ్యాదరిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించే లోపు మృతి చెందాడు. కార్తీక్ మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోపులపురం ప్రశాంత్ అశ్విని దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. కార్తీక్ తండ్రి బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. మృతుడి తల్లి అశ్విని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.



గోపులపురం కార్తీక్

మందమర్రిలో గంజాయి జోరు

● యథేచ్ఛగా విక్రయాలు ● రాత్రి వేళ బైక్ రైడింగ్‌లు ● మత్తులో పలువురిపై దాడులు

మందమర్రిటౌన్, మార్చి 25 : మందమర్రి పట్టణంలో గుడుంబా, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితం పాత బస్టాండ్ ఏరియాలో రామన్ కాలనీ రైల్వే బ్రిడ్జి వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. చెంచు కాలనీలో ఓ యువకుడు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే కేకే 5 బంగ్లాస్ ఏరియాలో గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేవారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నా యథేచ్ఛగా గంజాయి, గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయి. పట్టణంలో మూసివేసిన కేకే 3ఏ


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు (ఫైల్)

గని సమీపంలోని అటవీ ప్రాంతంతో పాటు మూసివేసిన కేకే 5ఏ గని వెనుక తోట, ఊరు మందమర్రి చెరువు కట్ట ఏరియాలో, ఊరు రామకృష్ణాపూర్ చెరువు కట్ట ఏరియాల్లో గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తుంది. మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి మందమర్రిలో విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల ఊరు రామకృష్ణాపూర్ రోడ్డుపై వెళ్తున్న ఓ వ్యక్తిని గంజాయి సేవించిన వ్యక్తులు బైక్‌తో ఢీకొట్టి అతనిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంజాయి సేవించిన యువకులు రాత్రివేళలో జాతీయ రహదారి మందమర్రిలోని పెట్రోల్ బంక్ వద్ద గల ఫ్లై ఓవర్ నుంచి పులి మడుగు ఏరియా వరకు బైక్ రైడింగ్ బెట్టింగ్ చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై కూడా పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

పున్నమి కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఏసీసీ, మార్చి 25: మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడలో సోమవారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో పున్నమి కవుల సమ్మేళనం (క్రైతల ఎన్నీల) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు తోకల రాజేశం రచయిత చక్రవర్తుల శ్రీమాన్ రాసిన కారున్ కథా సంపుటి పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా నుంచి అతి తక్కువ సంఖ్యలో కథా సంపుటిలో వెలువడుతున్నప్పటికి ఇక్కడి జీవన విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప కథా రచన చేస్తున్నారన్నారు. ఈ సమ్మేళనంలో కవులు నాగవర్మ ముత్యం, శ్రీమాన్, నీలాదేవి, అల్లం రాజయ్య, బోనగిరి రాజిరెడ్డి, అల్లాడి శ్రీనివాస్, భూపతి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రామకృష్ణాపూర్, మార్చి 25: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు మున్సిపల్ కార్మికులు యేటా ప్రజల వద్ద హోలీ మామూళ్ళు వసూలు చేసుకుంటారు. అందులో భాగంగా ఆదివారం విధులు ముగిసిన అనంతరం 9వ వార్డుకు హోలీ మామూళ్ల కోసం వెళ్ళే క్రమంలో దుకాణం వద్ద ఉన్న కౌన్సిలర్‌ను కలిశారు. కౌన్సిలర్ కార్మికులను దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడ్డాడన్నారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో, కాలనీలను శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ సఫాయి కార్మికులపై దౌర్జన్యానికి దిగిన కౌన్సిలర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కార్మికులు నల్ల రిబ్బన్లు ధరించి విధులు నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు మహేందర్, తిరుపతి, దేవవరం, రాజు, శ్రీనివాస్, శంకర్, సురేష్, రాజాలింగు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

భీమిని, మార్చి 25: రాంపూర్ వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణంలో నాణ్యత లోపించిందని ప్రజలు పేర్కొంటున్నారు. రూ.3.50 కోట్లతో చేపడుతున్న పనుల్లో నాసిరకమైన ఇసుక వాడుతున్నారనే ఆరోపణలున్నాయి. మంచిర్యాల సమీపంలోని ముల్కల ఇసుక రీచ్ నుంచి కాకుండా సమీప వాగుల నుంచి ఇసుకను కుప్పలుగా పోశారు. నాసిరకమైన ఎర్రటి ఇసుక వాడుతున్నారు. గుత్తేదారులు ఇసుక రీచ్ నుంచి నామమాత్రంగా ఇసుకను తెచ్చి వాగు నుంచి తెచ్చిన ఇసుకలో కలుపుతున్నారు అధికారులు స్పందించి వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు : హరీష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, భీమిని

రాంపూర్ వంతెన నిర్మాణంలో లోకల్ ఇసుక వాడుతున్నారనే సమాచారం లేదు. వంతెన పనులకు ముల్కల గోదావరి ఇసుకను మాత్రమే వాడాలని గుత్తేదారుడికి సూచించాం. నాణ్యమైన ఇసుకను వాడేలా చర్యలు తీసుకుంటాం. పనులపై పూర్తి సంతృప్తి చెందిన తర్వాతే బిల్లులు చేస్తాం.

కలగానే కళాశాల విద్య



- కాలేజీలు లేక అర్ధంతరంగా నిలిచిపోతున్న చదువులు
- జిల్లాలోని 9 మండలాల్లో జూనియర్ కళాశాలలు కరవు
- ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభం ● నూతన ప్రభుత్వంపై ఆశలు
- ఈ యేడైన ప్రారంభించాలని కోరుతున్న విద్యార్థులు

నెన్నెల, మార్చి 25: ఇంకా పదో తరగతి పరీక్షలు ప్రారంభమే కాలేదు. ఇంటర్ అడ్మిషన్ల కోసం ప్రైవేటు కళాశాలలు వెంపర్లాడుతున్నాయి. నగరాలు, పట్టణాలకు చెందిన కార్పొరేటు, ప్రైవేటు కాలేజీల సిబ్బంది పల్లెబాట పట్టారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇంటింటికి తిరిగి తమ కాలేజీల ప్రత్యేకతలు, సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, గత ఫలితాల గూర్చి చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. అడ్వాన్సులు తీసుకొని అడ్మిషన్లు చేసేసుకుంటున్నారు. డబ్బున్న వారి పిల్లలు ఆ కాలేజీల్లో చేరిపోతున్నారు. కాని ప్రైవేటు చదువు కొనలేక, ప్రభుత్వ కళాశాల విద్య అందుబాటులో లేని నిరుపేద విద్యార్థుల భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారింది.

పదికే ఫుల్‌స్టాప్...

ఆర్థికస్తోమత ఉన్న వారు లక్షలు వెచ్చించి ప్రైవేటు కళాశాలల్లో చేరి విద్యనభ్యసిస్తుండగా పేద విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలు లేక ఇంటర్మీడియెట్ చదువలేకపోతున్నారు. మండలానికొక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండాల్సి ఉండగా జిల్లాలో 9 మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేవు. పదో తరగతిలో మంచి మార్కులతో పాస్ అయినప్పటికి పట్టణాలకు వెళ్లి చదువుకునే ఆర్థిక స్తోమత లేక చాలా మంది చదువులకు ఫుల్ స్టాప్ పెట్టేస్తున్నారు. చదువుకోవాలనే ఆశ ఉన్న వారు సైతం అందుబాటులో కళాశాల విద్యలేక చదువును ఆపేసి తమ బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు. గత్యంతరం లేక ఎస్సెస్సీ స్థాయిలోనే తమ ఆశలసౌదాలను కూల్చేసుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులు అబ్బాయిలను దూరం పంపి చదివిస్తున్నప్పటికి బాలికలను పట్టణాలకు పంపడానికి జంకుతున్నారు. 40 శాతం బాలికల చదువులు ఎస్సెస్సీతో ఆగిపోతున్నాయి.

జిల్లాలో పదే ప్రభుత్వ కళాశాలలు..

మంచిర్యాల జిల్లాలో 245 వివిధ ఉన్నత పాఠశాల్లో 9,298 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వారిలో బాలురు 4790 మంది, బాలికలు 4508 మంది ఉన్నారు. మంచిర్యాల, మందమర్రి, కాసిపేట, చెన్నూరు, బెల్లంపల్లి బాలుర, బెల్లంపల్లి బాలికల, జైపూర్, జన్నారం, దండెపల్లి, లక్షెట్టిపేటలో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. 9 మండలాల్లో ప్రభుత్వ కళాశాలలు లేక పోవడంతో ఆయా మండలాల విద్యార్థులకు కళాశాల విద్య అందడం లేదు. వేమనపల్లి, కోటపల్లి, భీమారం, నస్పూర్, హాజీపూర్, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, తాండూరు మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేవు. మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికి జూని యర్ కాలేజీల ఏర్పాటు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తుం దనే ఆశలో గ్రామీణ ప్రాంత విద్యార్థులున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ల ఏర్పాటుకు చొరవ చూపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పదితో ఆపేయాల్సిందే...

కుర్మ శాంతిరాజ్, జిల్లెడ, వేమనపల్లి మండలం



మాది వ్యవసాయ కుటుంబం. జిల్లెడ నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నెపల్లికి రోజు సైకిల్ పై వెళ్లి పదో తరగతి చదువుతున్నా. మంచి మార్కులతో పాస్ అవుతాననే నమ్మకం ఉంది. 35 కిలోమీటర్ల దూరంలోని బెల్లంపల్లికి వెళ్లి ఇంటర్ చదవడం సాధ్యపడదు. ఊరికి బస్సు సౌకర్యం కూడా లేదు. పదో తరగతితో చదువు ఆపేయాల్సివస్తుందనే భయంగా ఉంది.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

గోమాస ఆకాష్, పదో తరగతి విద్యార్థి, కన్నెపల్లి



గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం మండల కేంద్రంలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలి. కాలేజీలు లేక పోవడంతో ఎంతో మంది చదువులను అర్థాంతరంగా నిలిపి వేస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారు సైతం అవకాశం లేక చదువుకోలేక పోతున్నారు. ఈ యేడు కళాశాల ప్రారంభిస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుంది.

పట్నం వెళ్లి చదవడం కష్టమే

చెన్నూజు విష్ణుప్రియా, పదోతరగతి, నెన్నెల



పదో తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న. ఇంటర్ కోసం పట్నం వెళ్లి చదువుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. బెల్లంపల్లికి వెళ్లి చదువుకుందామంటే సరిగ్గా బస్సు సౌకర్యం కూడా లేదు. మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

హోలీ సంబురాలు



మంచిర్యాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



దండేపల్లి సంబరాల్లో మహిళలు



మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసం వద్ద సంబరాలు



మందమర్రి పట్టణంలో...

ట్రైనీ బీట్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన



ట్రైనీ బీట్ అధికారులకు వివరిస్తున్న కోర్సు డైరెక్టర్

బెజ్జూరు, మార్చి 25: హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 42మంది బీట్‌అధికారులు అటవీక్షేత్ర పర్యటనచేశారు. ఫారెస్ట్ అకాడమి అసిస్టెంట్‌కోర్సు డైరెక్టర్ రాంమోహన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట, ఊట్ల ప్రాంతం, గడ్డిక్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడి అటవీ విశిష్టతను వారికి వివరించారు. మత్తడి ప్రాంతంలో పెద్దపులి సంచరించే ప్రదేశాన్ని పరిశీలించి వాటి అడుగుజాడలను చూశారు. ఇక్కడి అడవులు జీవ వైవిధ్యంతో కూడిన ప్రాంతానికి నెలవుగా ఉందని అధికారులు వివరించారు. ఆయనవెంట రేంజ్ అధికారి దయాకర్ తదితరులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 25 : మండల కేంద్రంలో గుడుంబా విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఏఎస్సై యాదవ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా చింతలమానేపల్లి మండల కేంద్రానికి చెందిన మేస్రం రవి వద్ద 5 లీటర్ల గుడుంబా, రూ. 2వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాదవ్ తెలిపారు.

భానుడి భగభగ

- జిల్లాలో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ఆసిఫాబాద్, మార్చి 25: ఎండలు దంచి కొడుతున్నాయి. జిల్లాలో సోమవారం 40.9డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన రెండు రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలలో జిల్లా మూడవ స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఐదు రోజులపాటు ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతవరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండవేడిమి నుంచి తట్టుకునేందుకు ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల ముందు ఉంటూ ఉపశమనం పొందుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా కెరమెరిలో 40.4, తిర్యాణిలో 39.4, వాంకిడిలో 39, రెబ్బెనలో 38.8, కాగజ్‌నగర్‌లో 38.4, పెంచికల్‌పేటలో 38.1, దహెగాంలో 37.9, సిర్పూర్(టి)లో 37.6 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఎస్పీఎం సమస్య పరిష్కరించకుంటే నేనే దీక్ష చేస్తా: కోనేరు కోనప్ప



దీక్షకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప



కిషోర్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్నకోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, మార్చి 25: లారీ అసోయేసియేషన్ సమ స్యపై ఎస్పీఎం యాజమాన్యం మంగళవారం వరకు స్పందించకుంటే తానే స్వయంగా దీక్ష చేస్తానని సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనప్ప అన్నారు. సోమవారం లారీ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల6 నుంచి లారీ అసోసియేషన్ సభ్యులు న్యాయమైనడిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ఇంతవరకు స్పందించ లేదన్నారు. యాజమాన్యం మంగళవారం లోపు సమస్యను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో తానే దీక్షచేస్తానన్నారు. డీసీసీ ప్రెసిడెంట్ కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం ఒంటెద్దు పోకడలకు పోకుండా సమస్యను పరిష్కరించుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు, సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీఎం యాజమాన్యంతో చర్చలు సఫలం

ఎస్పీఎం యాజమాన్యంతో సోమవారం సాయంత్రం అధికారులు, నాయకులతో చేపట్టిన చర్చలు ఫలించాయి. యాజమాన్యం పలు డిమాండ్లను అంగీకరించింది. మిగితా డిమాండ్లను ఏప్రిల్ మొదటి వారంలో పరిష్కరించేందుకు కృషిచేస్తామని తెలిపినట్టు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు తెలిపారు. చర్చలు సఫలం కావటంతో సమ్మెను విరమిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రమేష్

ఆసిఫాబాద్, మార్చి 25: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంవీ రమేష్ అన్నారు. సోమవారం జిల్లా ప్రత్యేక సబ్‌జైలులో న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఖైదీలు మంచి ప్రవర్తనతో సద్బుద్ధి కలిగి ఉండి కుటుంబాలకు మంచి విలువలను పెంచుకోవాలన్నారు. బెయిల్ మంజూరైన ఖైదీలకు స్యూరిటీ పెట్టుకుంటే బెయిల్ మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఖైదీలకు మెడిటేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీ అనంతలక్ష్మి, జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పరామర్శ



అండాలమ్మకు నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, మార్చి 25: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నానమ్మ అండాలమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ సోమవారం ఎమ్మెల్యేను పరామర్శించారు. ఈ సందర్భంగా అండాలమ్మ పార్థివదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు పూర్తి..

ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు నానమ్మ అండాలమ్మ అంత్యక్రియలు సోమవారం పూర్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల బియ్యం అక్రమ రవాణా



ఆటోలో అక్రమంగా తరలిస్తున్న హాస్టల్ బియ్యం

జైనూర్, మార్చి 25: మండలంలోని పట్నాపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 7క్వింటాళ్ళ50 కిలోల బియ్యంను హాస్టల్‌కు విద్యార్థులు ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఈ విషయం సోమవారం గ్రామంలోకి పాకడంతో గ్రామస్థులు హెచ్‌ఎం పర్శరాంను నిలదీశారు. గతంలో అనేక సార్లు ఇదే హాస్టల్ నుంచి బియ్యం తరలించారని విద్యార్థులు పేర్కొన్నారు. తమకు పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో గ్రామస్థులు హెచ్‌ఎంను ప్రశ్నించగా బియ్యం ఇతరులకు లోను ప్రాతిపదికన ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని తరలిస్తుండగా విద్యార్థులు పట్టుకున్నారని తాను ఎలాంటి తప్పు చేయలేదని జవాబిచ్చారు. లోను ప్రాతిపదికన ఇచ్చిన బియ్యం తిరిగి హాస్టల్‌కు వస్తాయని తాను ఎలాంటి తప్పు చేయలేదని హెచ్‌ఎం పర్శరాం తెలిపారు. అయితే అర్ధరాత్రి ఎందుకు తరలించారని ప్రజలు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

కుక్క దాడిలో ఒకరికి తీవ్రగాయాలు



గాయ పడిన కైలాస్

నెన్నెల, మార్చి 25: మండల కేంద్రానికి చెందిన జంగిలి కైలాస్ కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. కుశ్నపల్లి క్రాస్ రోడ్ వద్ద సోమవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్ళి తిరిగి వస్తుండగా అతడిపై కుక్క దాడిచేసింది. కిందపడేసి అతడి ముఖాన్ని తీవ్రంగా గాయపర్చింది. అటువైపుగా వెళ్లిన వారు గమనించి కుక్కను తరిమేశారు. వెంటనే నెన్నెల హెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలించారు. మండల కేంద్రంలో పిచ్చి కుక్కల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పది రోజుల్లో కుక్కల దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు. కుక్కలబెడద నుంచి కాపాడేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





విద్యార్థులతో కలిసి నృత్యాలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రె



హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కెరమెరి మండలం సాకడలో డోలు వాయిస్తున్న ఎంపీపీ మోతీరాం

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

● ఆనందోత్సాహాల మధ్య ఆడిపాడిన యువత ● పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు



సిర్పూర్(యు)లో రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తున్న గ్రామస్థులు, చిన్నారులు



వాంకిడిలో హోలీ ఆడుతున్న యువకులు, చిన్నారులు

ఆసిఫాబాద్, మార్చి 25: జిల్లా కేంద్రంలో సోమవారం హోలీ వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. చిన్నా, పెద్ద, యువతీ,యువకులు,అధికారులు,ఉద్యోగులుఅనే తేడాలేకుండా అందరూ హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకొని పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్‌దోత్రె హోలీవేడుకల్లో పాల్గొన్నారు. ఎస్టీ స్టడీసర్కిల్ విద్యార్థులతో కలసి నృత్యాలు చేశారు. అదనపుకలెక్టర్ వేణు, జిల్లాలోని ఆర్డీవోలు, రెవెన్యూశాఖ అధికారులు, జర్నలిస్టులు కలెక్టర్‌కు రంగులు పూసి పండుగ శుభాకంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి నివాసం వద్ద నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఆయా వీధుల్లో బ్యాండు మేళాలతో నృత్యాలు చేసుకుంటూ హోలీపండుగను ఘనంగా జరుపుకున్నారు. యువకులు పట్టణంలోని ఆయాకాలనీలు తిరుగుతూ రంగులు పోసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయామండలాల్లో కూడా హోలీవేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

వాంకిడి: మండలంలో సోమవారం ప్రజలు హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. మహిళలు, చిన్నారులు, యువతీయువకులు డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా పండుగను జరుపుకొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం హోలీ వేడుకలను పట్టణవాసులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ వార్డుల్లో చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు పోసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలో వివిధసంఘాల ఆధ్వర్యంలో ఆట,పాటలను నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ హోలీ వేడుకల్లో పాల్గొని అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జడ్పీ ఇన్‌చార్జీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణవాసులకు శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాలనాయకులు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

రెబ్బెన: మండలంలో సోమవారం హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువతీయువకులు ఒకరిపైనొకరు రంగులు పూసుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాల్లో సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్, బెల్లంపల్లి ఏరియాజీఎం దేవేందర్, జడ్పీటీసీ సభ్యుడు సంతోష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలవ్యాప్తంగా వేకువజామున కామదహనం చేశారు. అనంతరం ఉత్సాహంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. చిన్నపెద్ద తేడాలేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకున్నారు. గ్రామాల్లో యువత డీజేలు ఏర్పాటుచేసి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. హోలీవేడుకల్లో మహిళలు సైతం పాల్గొని రంగులు చల్లుకున్నారు. హోలీ వేడుకల్లో ఎస్సై విక్రం పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంతో మారుమూలగ్రామాల్లో హోలి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా యువకులు, పెద్దలు ఒకరిపై నొకరు రంగులు చల్లుకుంటూ ఆటల పాటలతో నృత్యాలు చేశారు. లేండిజాలలో ఎంపీపీ కుంర తిరుమ, మాజీసర్పంచులు మడావి భీంరావ్, మేస్రాం పార్వతీబాయి, పూసం రాము, కనక ప్రతిభ రంగుల కేళిలో పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

సిర్పూర్(యు): మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నపెద్ద తేడాలేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఆదివాసీలు తమ దైవాలైన మాతరి, మాతరల్‌లకు ప్రత్యేకపూజలు చేసితమ సంప్రదాయంతో డోలువాయిస్తూ నృత్యాలు చేస్తూ ప్రతి ఇంటింటికి తిరిగిరంగుల హోలీ జరుపుకున్నారు. అంతకుముందు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో జైనూర్ మాజీమార్కెట్ కమిటీచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, ఆత్రంగంగారాం, ఆత్రం ఆనంద్‌రావు, కనక నాగోరావు, కనక శ్యాంరావు, గోడం అమృత్‌రావు, ఆత్రంసునిల్‌కుమార్, మడావిధర్ము, తోడసం యాదవ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంతోపాటుగ్రామాల్లో హోలీ పర్వదినాన్ని ప్రజలు ఘనంగాజరుపుకున్నారు. ఉదయంనుంచి గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. బంధువులు,స్నేహితులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు.

చింతలమానేపల్లి: మండల వ్యాప్తంగా హోలీ సంబరాలు సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో వేకువ జామునే కామదహనం జరుపుకొని ఉత్సాహంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కాగజ్‌నగర్‌లో సంబరాలు



చింతలమానేపల్లిమండలం కర్జెల్లి హోలీ సంబరాల్లో పాల్గొన్న యువకులు



హోలీ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప





కాగజ్‌నగర్‌లో హోలీ సంబరాల్లో ప్రజలు



కాగజ్‌నగర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



కెరమెరిలో హోలీ రంగులు చల్లుకుంటున్న యువకులు

పండుగ పూట విషాదం..

- స్నానాలకు వెళ్లి నలుగురి మృతి
- మరణంలోనూ వీడని స్నేహబంధం
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

కౌటాల, మార్చి 25: పండుగ అంటే ఉత్సాహంగా, సరదాగా జరుపుకోవాలి. అందులో హోలీ పండుగ అంటే స్నేహితుల మధ్య ఉల్లాసంగా పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. రంగులతో విరజిల్లాల్సిన నాలుగు జీవితాలు హోలీ పండుగ రోజున విషాదాన్ని నింపాయి. కౌటాల మండంలోని తాటిపల్లి గ్రామం వద్దగల వార్దానదిలో మునిగి నలుగురు యువకులు మృతిచెందిన ఘటన మండలంలో విషాదఛాయలను నిలిపాయి. కౌటాల మండలం నదీమాబాద్‌కు చెందిన కమలాకర్(23) ఉప్పుల సంతోష్(22) ఎల్కులే ప్రవీణ్(23) ఆలం సాయి(20)తో పాటు మసల సంతోష్, మేడి నవీన్‌లు కలిసి హోలీ ఆడుకుని తాటిపల్లి వార్దా నదిలో స్నానాలకు వెళ్లారు. ఇందులో మేడి నవీన్‌కు ఇంటి నుంచి ఫోన్ రావడంతో అతను ఇంటికి వెళ్లాడు. మరో స్నేహితుడు సంతోష్‌కు ఫోన్ రావడంతో అతను బయట ఫోన్ మాట్లాడుతూ ఉండిపో యాడు. వార్దా నదిలో స్నానానికి దిగిన నలుగురు ఒకరి తరువాత ఒకరు లోతు అంచనా వేయక పోవడంతో నీటిలో మునిగిఒకరిని కాపాడేందుకు పోయి ఒకరు ఇలా నలు గురు గల్లంతయ్యారు. నలుగురు స్నేహితులు నీటిలో మునిగిపోతున్న సమయంలో బయటఉన్న స్నేహితుడు సంతోష్ కాపాడండి అని కేకలు వేస్తుండగా నలుగురు నీటిలో మునిగిపోయారు. సంఘటన స్థలంలో ఉన్నవారు వెంటనే కౌటాల సీఐ సాదిక్ పాషాకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ సాదిక్‌పాషా పరిసరాలను పరిశీలించి జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాటిగుడ గ్రామానికి చెందిన గజఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. మూడు గంటల తరువాత మృతదేహాలను బయటికి తీశారు. మృతిచెందిన వారిలో ఎల్కులే ప్రవీణ్‌కు వివాహంఅయి ఒక ఏడాది కుమారుడు, భార్య ఉన్నారు. మృతి చెందిన మరో ముగ్గురిలో ఉప్పుల సంతోష్ స్థానిక రైస్‌మిల్లులో ఆపరేటర్, పనాసా కమలాకర్ డ్రైవర్, ఆలం సాయి ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు.



కమలాకర్, ప్రవీణ్‌కుమార్, ఆలం సాయి, ఉప్పుల సంతోష్(ఫైల్)

● మిన్నంటిన కుటుంబీకుల రోధనలు

నలుగురు స్నేహితులు నీటమునిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. నదిలో నలుగురు మునిగి చనిపోయారన్న వార్త తెలియగానే ప్రజలంతా సంఘటన స్థలానికి చేరుకుని వారితో గడిపిన క్షణాలను గుర్తు చేసుకుంటూ కంటతడి పెటుకున్నారు. జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ.

నలుగురు యువకులు నదిలో మునిగి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ కరుణాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహా లను పరిశీలించి కౌటాల సీఐ సాదిక్ పాషాను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సరదాలకు పోయి ప్రణాలను పోగొట్టుకోవద్దన్నారు. సరదా జీవితంలో ఎప్పటికీ ఉంటుందని కానీ ప్రాణం ఒక సారి పోతే తిరిగి రాదని యువకులు గమనించాలన్నారు. వారి వెంట ఎస్సై మధుకర్, ఏఎస్సై దేవిసింగ్ ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్



మృతి చెందిన యువకులు

ఎల్లందు క్లబ్‌లో హోలీ వేడుకలు



మాట్లాడుతున్న జీఎం మనోహర్

మందమర్రిటౌన్, మార్చి 25: మందమర్రిలోని ఎల్లందు క్లబ్‌లో సోమవారం హోలీ పండగను సింగరేణి అధి కారులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికిఒకరు రంగులు పూసుకుని నృత్యాలు చేశారు. అనంతరం జీఎం మనోహర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఏరియా 92శాతం ఉత్పత్తిని సాధించిందన్నారు. అదనపు ఉత్పత్తి సాధిస్తేనే ఏరియా ప్రగతి పథంలో ముందుంటుందన్నారు. లక్ష్యంలో వెనకబడి ఉన్న గనుల అధికారులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని, ప్రమాద రహిత ఉత్పత్తి చేయాలన్నారు.

కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపానకం ధ్వంసం



బెల్లంపానకం డ్రమ్ములను ధ్వంసం చేసిన పోలీసులు

పెంచికల్‌పేట, మార్చి 25: మండలంలోని దర్గపెల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా కోసం నిలువ చేసిన 500లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ దారుడైన మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు.